జీవనభృతి ఇవ్వాలని నిరసన

మాచారెడ్డి, న్యూస్‌టుడే: షరతుల్లేకుండా తమకు జీవనభృతి అందించాలని బీడీకార్మికులు శనివారం నిరసన తెలిపారు. బీఎల్‌టీయూ, శ్రామికశక్తి బీడీ వర్కర్స్ యూనియన్, ఏఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో వారు మాచారెడ్డి ఎంపీడీవో కార్యాలయం ఎదుట బైఠాయించారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. 2014, ఫిబ్రవరి 28 తర్వాత పీఎఫ్ పొందిన వారికి పింఛన్ ఇవ్వాలన్నారు. రూ.4016లకు పెంచి జీవనభృతి అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీవో నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. బీఎల్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సిద్దిరాములు, రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఆంజనేయులు పాల్గొన్నారు.


కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న బీడీ కార్మికులు


నిరసన తెలుపుతున్న విశ్వహిందూపరిషత్, బజరంగ్‌దళ్ ప్రతినిధులు

‘హిందువుల మనోభావాలు దెబ్బతీసే కుట్ర’

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: హిందువుల మనోభావాలను కొందరు దెబ్బతీసే కుట్ర చేస్తున్నారని విశ్వహిందూపరిషత్, బజరంగ్‌దళ్ ప్రతినిధులు అన్నారు. కామారెడ్డి జిల్లాకేంద్రంలోని నిజాంసాగర్‌చౌరస్తాలో శనివారం నిరసన తెలిపారు. హిందూ ఆలయాలపై దాడులు చేసి విగ్రహాలను ధ్వంసం చేయడం అనైతికమన్నారు. దేవాలయాలకు రక్షణ కల్పించాలన్నారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ప్రతినిధులు సామల గంగారెడ్డి, రాజు, శ్రీకాంత్, అశోక్, తులసి, వినోద్, ప్రసాద్ తదితరులున్నారు.

ఏడాదికి రూ.కోటి జీతం.. అయినా వద్దనుకున్నా..!

ఈనాడు, కామారెడ్డి

◆ పక్కా ప్రణాళికతోనే పోటీ పరీక్షల్లో విజయం
◆ ఈనాడుతో కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

ప్రజలకు సేవచేస్తూ దేశప్రగతిలో భాగస్వామ్యం కావాలనే సంకల్పంతోనే అమెరికాలో ఏడాదికి రూ.కోటి వేతనం వచ్చే ఉద్యోగాన్ని వదులుకుని లక్ష్యంగా పెట్టుకున్న సివిల్స్ సాధించానని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ చెప్పారు. పక్కా ప్రణాళిక, తగిన కార్యాచరణతోనే సివిల్స్‌లో విజయం సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈనాడుతో తన ప్రగతి ప్రస్థానాన్ని పంచుకున్నారు. వివరాలు ఆయన మాటల్లోనే..

స్వస్థలం హరియాణా

మాది హరియాణా రాష్ట్రం. నాన్న క్రిషన్ పాల్ సాంగ్వాన్, అమ్మ సాత్‌కౌర్ సాంగ్వాన్. ఇద్దరూ లెక్చరర్లుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇంటర్ వరకు స్వరాష్ట్రంలోనే చదివా. దిల్లీ ఐఐటీలో ఇంజినీరింగ్ పూర్తిచేశాను. ఆ తర్వాత అమెరికా అట్లాంటాలో సాఫ్ట్‌వేర్ కంపెనీలో మూడేళ్లు ఉద్యోగం చేశాను. మొదట రూ.40 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగంలో చేరాను. మూడో సంవత్సరం రూ.కోటి వార్షిక వేతన ప్యాకేజీ ప్రకటించారు. అయినా సమాజ సేవ చేయాలనే సంకల్పంతో రాజీనామా చేసి సివిల్స్‌కు ప్రిపరేషన్ ప్రారంభించాను.

మూడో ప్రయత్నంలో ఐఏఎస్

ఎలాంటి శిక్షణ లేకుండా తొలిసారి సొంతంగా సివిల్స్ పరీక్ష రాసి రైల్వేలో ఉద్యోగం సాధించాను. టెక్నికల్ సిగ్నలింగ్ విభాగంలో విధులు నిర్వహించాను. రెండో ప్రయత్నంలో సఫలీకృతం కాలేదు. నిరాశ చెందకుండా ఉద్యోగం చేస్తూనే మూడోసారి ప్రయత్నం చేసి ఆలిండియా 12వ ర్యాంకు సాధించి ఐఏఎస్ సాధించాను. గణితం అంటే ఇష్టం ఉండడంతో దాన్నే సివిల్స్‌లో ఐచ్ఛికం(ఆప్షనల్)గా తీసుకున్నాను. ప్రిపరేషన్‌కు రోజూ 10 నుంచి 12 గంటలు కేటాయించా. నిత్యం మూడు నుంచి నాలుగు పత్రికలు చదివా.

పుస్తకాలు ఎక్కువగా చదువుతా

బ్యాడ్మింటన్, టెన్నిస్, క్రికెట్, చెస్ అంటే ఇష్టం. పాఠశాల స్థాయి నుంచి సాధన చేశాను. సంగీతం అంటే మహా ఇష్టం. మహనీయుల, సామాజిక, శాస్త్ర సాంకేతిక అంశాలకు సంబంధించిన పుస్తకాలు ఎక్కువగా చదువుతాను. దినపత్రికలను క్రమం తప్పకుండా ఫాలో అవుతాను. నా భార్య వళ్లూరి క్రాంతి సివిల్స్ శిక్షణలో అకాడమీలో పరిచయమయ్యారు. ప్రస్తుతం సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.



ఏకాగ్రతతో ఏదైనా సాధ్యమే..

యువత, విద్యార్థులు, ఉద్యోగార్థులు సాధ్యమైనంత వరకు సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండడం శ్రేయస్కరం. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులు సిలబస్‌కు అనుగుణంగా పుస్తకాలను సిద్ధం చేసుకోవాలి. ఏకాగ్రతతో చదివితే సాధించలేనిది ఏదీ ఉండదు. నేటి యువత, ఉద్యోగార్థులు విజ్ఞానాన్ని అందించే పుస్తకాలను చదవడంపై ఆసక్తి చూపాలి.

ఐఐటీ, నీట్ శిక్షణ ఇప్పిస్తా

నిర్మల్ జిల్లాలో ఏడాది పాటు కలెక్టర్‌గా విధులు నిర్వహించాను. ప్రస్తుతం జిల్లాలో నాలుగు నెలల కిందట బాధ్యతలు చేపట్టాను. క్షేత్రస్థాయిలో వెళ్లినప్పుడు ఇక్కడి విద్యార్థుల విద్యాప్రగతి తెలుసుకుంటున్నాను. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రత్యేకంగా ఐఐటీ, నీట్ శిక్షణ ఇప్పించాలని ప్రయత్నిస్తున్నాను. నాణ్యమైన విద్య అందించేలా ఉపాధ్యాయులకు అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తున్నాను.

అక్రమాల గుట్టు విప్పేదెవరు..?

☛ మౌన ముద్రలో పాలకులు, అధికారులు

ఈనాడు, కామారెడ్డి

నిరుపేదల స్వాధీనంలో ఉండాల్సిన అసైన్డ్ భూములు పెద్దల గుప్పిట్లోకి వెళ్లాయి. జిల్లాలోని పలు ప్రాంతాల్లో రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూములను భూబకాసూరులు రెవెన్యూ అధికారుల అండదండలతో తప్పుడు పత్రాలతో ఎన్వోసీలు తీసుకుని పట్టా భూములుగా మార్చుకున్నారు. భిక్కనూరు మండలం జంగంపల్లిలో ఏకంగా కొందరు రెవెన్యూ అధికారులే బినామీల పేరిట అసైన్డ్‌భూములను కాజేసిన ఉదంతాలు వెలుగు చూస్తున్నాయి. రూ.కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములు పరాధీనం అవుతున్నా పాలకులు, ఉన్నతాధికారులు మౌనం వీడడం లేదు.



రెవెన్యూ లొసుగులతో ఎన్వోసీలు

ఆర్వోఆర్ చట్టంలో ఉన్న లొసుగులతో మాజీ సైనికోద్యోగుల పేర్లు చెప్పి తప్పుడు దస్త్రాలతో ఎన్వోసీలు తీసుకుని అసైన్డ్‌భూములను పట్టా భూములుగా మార్చుకున్నారు. ఎల్‌ఆర్‌యూపీ (ల్యాండ్ రికార్డ్స్ అప్‌డేట్ ప్రాజెక్టు) అనంతరం ప్రభుత్వం భూముల లావాదేవాలను పారదర్శకంగా నిర్వహించేందుకు ధరణి పోర్టల్‌ను ప్రవేశపెట్టింది. ఈ సమయంలోనే అక్రమాలకు అలవాటు పడిన రాజకీయ నాయకులు, రెవెన్యూ ఉద్యోగులు బంధువులు, బినామీల పేరిట ప్రభుత్వ అసైన్డ్ భూములను తమ పేరిట బదలాయించుకుని పట్టాభూములుగా మార్చుకున్నారు. భిక్కనూరు, మాచారెడ్డి, కామారెడ్డి గ్రామీణ మండలంలో రూ.కోట్ల విలువైన ప్రభుత్వ అసైన్డ్‌భూములకు ఎన్వోసీలు జారీ చేసి పట్టాభూములుగా మార్చారు. ఆయా స్థలాల్లో స్థిరాస్తి దందా మొదలుపెట్టారు.

ఇతర జిల్లాల్లో..

రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో ఎల్‌ఆర్‌యూపీ సమయంలో జరిగిన అక్రమాలపై రెవెన్యూ ఉన్నతాధికారులు విచారణ చేసి అక్రమార్కులపై ఉక్కుపాదం మోపుతున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో ధరణి పోర్టల్ ఆపరేటర్‌తో కలిసి లేని భూములకు డిజిటల్ పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేసి రైతుబంధు నిధులు స్వాహా చేసిన తహసీల్దార్‌ను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. జిల్లాలో మాత్రం చర్యలకు వెనుకాడుతున్నారు.

విక్రయించే పన్నాగం

భిక్కనూరు మండలం జంగంపల్లిలో 16 ఎకరాల అసైన్డ్‌భూములను జిల్లాలో విధులు నిర్వహించిన ఓ రెవెన్యూ అధికారి తన బినామీల పేరిట ఎల్‌ఆర్‌యూపీలో నమోదు చేసుకున్నాడు. ఆ తర్వాత ఇద్దరు స్థానిక నేతలను సైనికోద్యోగులుగా చూపి వారి పేరిట ఎన్వోసీలు తీసుకుని పట్టాభూములుగా మార్చుకున్నాడు. ప్రస్తుతం ఆ భూములను చదును చేసి బడా పరిశ్రమలకు విక్రయించి రూ.కోట్లు గడించేందుకు పన్నాగాలు పన్నుతున్నారు.


కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, ఎస్పీ సింధుశర్మలతో రోడ్‌సేఫ్టీ అంబాసిడర్లు

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన అవసరం

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: విద్యార్థులు పాఠశాల దశ నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని కామారెడ్డి పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శనివారం రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. రోడ్డు నిబంధనలు ప్రతి ఒక్కరు కచ్చితంగా పాటించడంతో పాటు కుటుంబీకులు, ఇరుగుపొరుగు వారికి తెలియజేయాలని సూచించారు. రోడ్డు భద్రత, నిబంధనల అంబాసిడర్లుగా జిల్లాలోని 61 పాఠశాలలకు చెందిన 122 మందిని ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఎస్పీ సింధుశర్మ మాట్లాడుతూ.. జిల్లాలో గతేడాది 500లకు పైగా ప్రమాదాలు జరిగినట్లు వెల్లడించారు. ప్రమాదాలకు కారణమైన వారికి చట్టం 10 ఏళ్ల పాటు శిక్ష విధిస్తుందని హెచ్చరించారు. అనంతరం రోడ్‌సేఫ్టీ క్విజ్ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. డీఈవో రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయాలకు చెక్

● జిల్లాకేంద్రంలో ఫీడర్ల అనుసంధానం

న్యూస్‌టుడే, కామారెడ్డి కలెక్టరేట్


విద్యుత్తు సరఫరాలో అంతరాయాలు లేకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఎక్కడైనా సాంకేతిక సమస్య తలెత్తితే రెండు నిమిషాల్లో విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించడానికి కసరత్తు చేస్తున్నారు. కామారెడ్డి జిల్లాకేంద్రంలో నాలుగు ఫీడర్లను ఇతర ఫీడర్లతో అనుసంధానం చేశారు. ఈ విధంగా ఒక ఫీడర్‌ను మరో ఫీడర్‌తో అనుసంధానం చేసే ప్రక్రియను ఇదివరకు కరీంనగర్, నిజామాబాద్ నగరాల్లో చేపట్టారు. తాజాగా కామారెడ్డిలోనూ శనివారం ప్రక్రియ పూర్తి చేశారు. అనంతరం ఒక ఉపకేంద్రం నుంచి అనుసంధానం చేసిన ఫీడర్ల ద్వారా ప్రయోగాత్మకంగా విద్యుత్తు సరఫరా చేశారు.

ఏవేవంటే..

● సిరిసిల్ల రోడ్డు ఫీడర్‌కు జయశంకర్ కాలనీ ఫీడర్‌ను అనుసంధానం చేశారు. దీనికి కలెక్టరేట్ సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్తు సరఫరా చేశారు. ఇండస్ట్రియల్ ఫీడర్- ఆరేపల్లి ఇండస్ట్రియల్ ఫీడర్, రామారెడ్డి- గుమాస్తాకాలనీ, అయ్యప్పనగర్- కలెక్టరేట్ ఉపకేంద్రం జయశంకర్ కాలనీ ఫీడర్లను అనుసంధానం చేశారు.

మరమ్మతులు జరిగినా.. సరఫరా నిలిచిపోదు

ప్రస్తుతం విద్యుత్తు సరఫరాలో చిన్నచిన్న సమస్యలు తలెత్తుతున్నాయి. కామారెడ్డి పట్టణంలో ఈ సమస్య ఎక్కువగానే ఉంది. ఉపకేంద్రాల్లో మరమ్మతులు చేపడితే పని పూర్తయ్యే వరకు విద్యుత్తు సరఫరాను నిలిపివేస్తారు. ఫీడర్ల అనుసంధాన పూర్తయితే ఇకపై విద్యుత్తు అంతరాయాలు కనిపించవు. జిల్లాకేంద్రంలోని విద్యుత్తు ఉపకేంద్రాలను రింగ్‌మెన్ సిస్టం ద్వారా 11 కేవీ గ్రిడ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. దీని ద్వారా ఏ ఉపకేంద్రంలోనైనా సాంకేతిక సమస్య ఏర్పడితే వెంటనే మరో ఉపకేంద్రం నుంచి విద్యుత్తు సరఫరా చేస్తారు. ఫీడర్లకు 400 ఆంప్స్ ఏబీ స్విచ్‌లను బిగిస్తున్నారు. గతంలో జంపర్లు ఉండేవి. ఈ జంపర్లను మార్చడానికి విద్యుత్తు సరఫరా బంద్ చేసి స్తంభాలపైకి ఎక్కి మార్చేవారు. ప్రస్తుతం ఏర్పాటు చేసిన ఏబీ స్విచ్‌ల వల్ల విద్యుత్తు సరఫరా ఉన్నప్పుడే ఒక ఫీడర్ నుంచి మరో ఫీడర్‌కు నిమిషం వ్యవధిలో విద్యుత్తు సరఫరాను పునరుద్ధరిస్తారు. నిజామాబాద్ జిల్లాలోనూ సుభాష్‌నగర్ ఉపకేంద్రాన్ని పైలెట్‌గా ఎంచుకున్నారు. ఇక్కడ కూడా ఫీడర్ల అనుసంధానం ప్రక్రియ చేపట్టి విద్యుత్తును సరఫరా చేశారు.


అనుసంధాన ప్రక్రియ పూర్తిచేస్తున్న విద్యుత్తు సిబ్బంది

మిగతా ఉపకేంద్రాల్లోనూ ఏర్పాటు

- రమేశ్‌బాబు, ఎస్ఈ, ఎన్‌పీడీసీఎల్, కామారెడ్డి

కామారెడ్డి పట్టణంలో సిరిసిల్ల రోడ్డు ఉపకేంద్రం పరిధిలో వివిధ ఫీడర్ల ద్వారా ప్రయోగాత్మకంగా విద్యుత్తు సరఫరా చేశాం. ఈ విధానంతో సమస్య ఎదురైనా మరో ఫీడర్‌తో విద్యుత్తు సరఫరా పునరుద్ధరిస్తాం. పట్టణంలోని మిగతా ఉపకేంద్రాల్లో ఇదే విధంగా ఫీడర్ల అనుసంధాన ప్రక్రియ పూర్తి చేస్తాం. సీఎండీ ఆదేశాలతో పనులు వేగవంతం చేస్తున్నాం.

దేశాయిపేట్‌లో మద్యం అమ్మకాలు నిషేధం

బాన్సువాడ గ్రామీణం, న్యూస్‌టుడే : దేశాయిపేట్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో గ్రామంలో మద్యం అమ్మకాలపై నిషేధం విధించినట్లు గ్రామపెద్దలు పేర్కొన్నారు. దేశాయిపేట్ ఆదర్శంగా నిలవాలని గ్రామపెద్దలు, యువకులు నిర్ణయించారు. అక్టోబర్ 21 నుంచి ఈ నిషేధం అమల్లోకి వస్తుందని గ్రామపెద్దలు తెలిపారు. ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా మద్యం అమ్మితే రూ.50,000 జరిమానా విధిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రకాష్, రమణ, విఠల్, సాయిలు, బీరప్ప, బాబురావు, సాయాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



పొదల తొలగింపు



పల్వంచ మండలంలోని ఆరేపల్లి ప్రయాణ ప్రాంగణం పొదల్లో, పిచ్చి మొక్కల మాటున ఉందని ‘పొదల్లో ప్రయాణ ప్రాంగణం’’ శీర్షికన ఈనాడులో చిత్ర కథనం శనివారం ప్రచురితమైనది. స్పందించిన అధికారులు ప్రయాణ ప్రాంగణం చుట్టూ ఉన్న పొదలు, పిచ్చి మొక్కలను తొలగించారు. ప్రయాణికులు కూర్చునేలా తీర్చిదిద్దారు.

- న్యూస్‌టుడే, మాచారెడ్డి

‘ఏడాదిలోనే విశ్వాసం కోల్పోయిన ప్రభుత్వం’

నిజామాబాద్ నగరం, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది కాలంలోనే ప్రజల విశ్వాసం కోల్పోయిందని మాల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. నిజామాబాద్ జిల్లాకేంద్రంలో శనివారం సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. అనంతరం భాజపా జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కళ్యాణలక్ష్మి చెక్కుతో పాటు తులం బంగారం, మూసీ పునరుజ్జీవం పేరిట పేదల ఇళ్ల కూల్చివేత, పింఛన్ల సంఖ్య పెంచకపోవడం, ఉన్నవారికే ఆలస్యంగా ఖాతాల్లో వేస్తుండటంతో ప్రజలు ఎదురుతిరగనున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఎందుకు ఓటేశామనే పరిస్థితి వచ్చిందని ఎద్దేవా చేశారు. నిరుద్యోగుల ఆందోళనకు భాజపా మద్దతు నిలుస్తుందని పేర్కొన్నారు. గ్రామాల్లో సభ్యత్వ నమోదుకు వెళ్తే సమస్యలపై వినతులు వెల్లువెత్తుతున్నాయన్నారు. ప్రజల పరిస్థితి పెనం మీది నుంచి పొయ్యిలో పడ్డట్లయిందన్నారు. రూ.2 వేల పింఛన్ రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేలు ఇస్తామని రేవంత్‌రెడ్డి చెప్పారని, పరిస్థితి చూస్తే కొత్తవి దేవుడెరుగు ఉన్నవి తొలగించకుంటే చాలన్నారు. హామీలు పక్కనబెట్టి మూసీ పునరుజ్జీవానికి రూ.కోట్లు ఖర్చు చేస్తామంటున్నారని తెలిపారు. గ్రూప్-1 అభ్యర్థులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ మద్దతు తెలిపేందుకు వెళ్తే అడ్డుకోవడం హేయమన్నారు. జిల్లాలో 7 లక్షల ఓట్లు వచ్చాయని, అందులో సగమైనా సభ్యత్వాలు చేయించాలని సూచించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్, పల్లె గంగారెడ్డి, పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, న్యాలం రాజు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాజేందర్, వేదికపై ఎమ్మెల్యే ధన్‌పాల్

నిజామాబాద్ ఇన్‌ఛార్జి సీపీగా సింధుశర్మ

ఇందూరు సిటీ, న్యూస్‌టుడే: నిజామాబాద్ పోలీసు కమిషనర్ కల్మేశ్వర్ శింగెనవార్ బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో ఇన్‌ఛార్జి సీపీగా సింధుశర్మను నియమితులయ్యారు. జిల్లాకు పూర్తి స్థాయి పోలీసు కమిషనర్ వచ్చే వరకు ఆమె కొనసాగనున్నారు.

మాక్లూర్ కస్తూర్బాలో వింతలు

● పోగొట్టుకున్న గొలుసు కోసం విద్యార్థినిని మంత్రగాడి వద్దకు తీసుకెళ్లిన సిబ్బంది

మాక్లూర్, న్యూస్‌టుడే: శాస్త్రీయత బోధించాల్సిన ఉపాధ్యాయురాలు మూఢత్వం బాట పట్టారు. పోయిన తన గొలుసు కోసం ఆరో తరగతి విద్యార్థినిని మంత్రగాడి వద్దకు తీసుకెళ్లారు. ఇప్పుడీ ఘటన నిజామాబాద్ జిల్లా అంతటా చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళ్తే.. కొన్నాళ్లుగా వివాదాలకు కేంద్ర బిందువుగా మారిన మాక్లూర్ కస్తూర్బాలో మూఢనమ్మకాలు పెరిగాయి. కేజీబీవీలో ఉపాధ్యాయురాలి బంగారు గొలుసు గురువారం రాత్రి మాయమైంది. విద్యార్థినులే దొంగిలించారని కొంత మంది సిబ్బంది అనుమానించారు. ఓ విద్యార్థినిని మంత్రగాడి వద్దకు తీసుకెళ్తే నిజం బయటపడుతుందని సిబ్బంది భావించారు. ఆరో తరగతి చదువుతున్న బాలికను జిల్లాకేంద్రం మాలపల్లిలో నివాసముండే మాంత్రికుడి వద్దకు శుక్రవారం తీసుకెళ్లారు. నిమ్మకాయలు ముందుంచి, విద్యార్థిని చేతి వేలుకు నల్లటి రంగువేసి మంత్రాలు వేశారు. చివరకు చెత్తబుట్టలో బంగారు చైన్ ఉందని, వెళ్లి వెతుక్కోండని పంపించాడు. తీవ్ర భయాందోళనకు గురైన బాలిక ఒంటరిగానే పాఠశాలకు వచ్చింది. ఈ ఘటనపై శిక్షణ కలెక్టర్ సంకేత్‌కుమార్ శనివారం విచారణ చేపట్టారు. సిబ్బందిని ఒక్కొక్కరిని పిలిచి మాట్లాడారు. విద్యార్థినితో మాట్లాడగా తనను మంత్రగాడి వద్దకు తీసుకెళ్లిన విషయం భయంతో వెల్లడించింది.

వర్గాలుగా విడిపోయి...

రెండు నెలల కిందట ప్రత్యేక అధికారిణిగా అనురాధ బాధ్యతలు చేపట్టిన తర్వాత కస్తూర్బాలో సిబ్బంది రెండుగా చీలిపోయారు. పరస్పరం దూషించుకుంటూ ఉన్నతాధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసుకున్నారు. విద్యార్థినిని మంత్రగాడి వద్దకు తీసుకెళ్లిన వ్యవహారాన్ని ఓ వర్గం అనుకూలంగా మార్చుకొని చిన్నారితో చెప్పించి వీడియో తీశారు. అది అధికారులకు అందేలా చూశారు.

పాఠశాలల్లో మెరుగైన వసతులు

ఎల్లారెడ్డి, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పిస్తామని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు పేర్కొన్నారు. ఎల్లారెడ్డి కేజీబీవీలో రూ.3.25కోట్ల నిధులతో చేపట్టనున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు శనివారం ఆయన భూమి పూజ చేశారు. అనంతరం విద్యార్థినులతో ముచ్చటించారు. శివనగర్‌గేట్ వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ రజిత, నాయకులు వెంకటరామిరెడ్డి, సాయిబాబా, సత్యం, ఆరీఫ్, ప్రశాంత్ గౌడ్, నారాగౌడ్, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.


ఎల్లారెడ్డి కేజీబీవీలో విద్యార్థినులతో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్

మళ్లీ.. మళ్లీ.. ఎత్తుకెళ్లి

● నిజామాబాద్ జీజీహెచ్‌లోనే రెండు ఘటనలు

ఈనాడు, నిజామాబాద్

నిజామాబాద్ జిల్లాలో చిన్నారుల అపహరణ ఘటనలు తల్లిదండ్రులను కలవరపెడుతున్నాయి. గడిచిన తొమ్మిది నెలల్లో అయిదుగురు చిన్నారులను ఎత్తుకెళ్లారు. శుక్రవారం అర్ధరాత్రి నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆవరణలో నుంచి ఏడాది బాలుడు అపహరణ కలకలం రేపింది. జులైలో ఆసుపత్రి ప్రాంగణంలోంచి మూడేళ్ల బాలుడ్ని ఇద్దరు యువకులు ఎత్తుకెళ్లిన విషయం తెలిసిందే. అప్పట్లో సీసీ కెమెరాల దృశ్యాల ఆధారంగా నిందితులను పట్టుకున్నారు. తాజా ఘటనలోనూ అదే తరహాలో దర్యాప్తు సాగుతోంది. రెండు బృందాలు ఇప్పటికే రంగంలోకి దిగాయి.

ఆసుపత్రి ఆవరణను ఎంచుకొని..

జులై, తాజా ఘటనలో ఆసుపత్రి ఆవరణలో నుంచే చిన్నారులను ఎత్తుకెళ్లడం భద్రతా లోపాన్ని తేటతెల్లం చేస్తోంది. సాయంత్రం నుంచే రెక్కీలు నిర్వహించి.. చిన్నారులతో వచ్చిన తల్లిదండ్రులను గమనిస్తూ గడుపుతున్నారు. అర్ధరాత్రి దాటక వారు నిద్రలోకి జారుకున్నాక సినీఫక్కీలో తమ పని కానిచ్చేస్తున్నారు. ప్రస్తుత బాధితులు మద్నూర్‌కు చెందిన రాజు-లక్ష్మి దంపతులు మూడేళ్ల కుమార్తె, ఏడాది కుమారుడితో శుక్రవారం సాయంత్రం ఆసుపత్రికి వచ్చారు. అనారోగ్య సమస్య ఉన్న లక్ష్మికి పరీక్షలు చేయించాలని భావించారు. ఆ సమయంలో ఓపీ లేక ఆవరణలోనే నిద్రించి శనివారం ఉదయం వైద్యుడికి చూయించుకోవాలని భావించారు. కానీ తెల్లారేసరికి పక్కలోని తమ ఏడాది కొడుకు మణికంఠ కనిపించకపోవటంతో పోలీసులను ఆశ్రయించారు.

●● **చేతిలో బాలుడు?** పోలీసులు సీసీ కెమెరాల్లో రికార్డయిన దృశ్యాలను పరిశీలించారు. ఓ మహిళ మరో ఇద్దరు యువతులతో కలిసి ఆవరణలో తిరుగుతున్న దృశ్యం అనుమానాస్పదంగా కనిపించింది. అర్ధరాత్రి వీరు ఆసుపత్రి బయటి గేటు వద్ద నుంచి బయటకు వస్తున్న సందర్భంలో ఒకరు చంటి పిల్లాడిని ఎత్తుకున్నట్లు సీసీ కెమెరాలో నిక్షిప్తమైంది. వీరి ముఖాలు గుర్తించేలా లేవు. ఆసుపత్రి చుట్టుపక్కల వెళ్లిన వాహనాల గురించి ఆరా తీస్తున్నారు. బస్టాండు, ప్రధాన రహదారిలో సీసీకెమెరాలు పరిశీలించారు.

ఇద్దరు వీవోఏల సస్పెన్షన్

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: విధుల్లో నిర్లక్ష్యం వహించిన రెడ్డిపేటకు చెందిన ఇద్దరు వీవోఏలను సస్పెండ్ చేస్తున్నట్లు డీఆర్‌డీవో సురేందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వయంసహాయక సంఘ సభ్యులు స్త్రీనిధి బ్యాంకుకు చెల్లించిన రూ.78,500లను సంబంధిత వీవోఏకి ఇచ్చి స్త్రీనిధి బ్యాంకులో చెల్లించాలని సూచించారు. కానీ వీవోఏ రూ.74,316లను మాత్రమే బ్యాంకులో చెల్లించారు. మిగిలిన రూ.4,184లను సంబంధిత సభ్యురాలికి చెల్లిస్తామని చెప్పారు. దీంతో విధుల్లో నిర్లక్ష్యం వహించిన వీవోఏలు లక్ష్మీనర్సమ్మ, కృష్ణవేణిలను విధుల నుంచి తొలగించారు. ఏపీఎం, సీసీలకు సంజాయిషీ నోటీసు జారీ చేశారు.

విద్యార్థి సర్వ సమాచారనిధి.. అపార్

● మొదట 9-12 తరగతులకు ప్రాధాన్యం

న్యూస్‌టుడే, నిజామాబాద్ విద్యావిభాగం

వ్యక్తికి ఆధార్‌కార్డు ఎలాగో విద్యార్థి సమగ్ర సమాచారం కోసం ఇకపై అపార్(ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమీ అకౌంట్ రిజిస్ట్రీ) ఉపయోగపడనుంది. జాతీయస్థాయిలో ప్రతి విద్యార్థికి ఒక్కో నంబరు కేటాయించి తదనుగుణంగా వారి సమగ్ర సమాచారం నిక్షిప్తం చేస్తారు. 'వన్ నేషన్- వన్ స్టూడెంట్' నినాదంలో భాగంగా కేంద్ర విద్యామంత్రిత్వ శాఖ కొత్త అధ్యయనానికి శ్రీకారం చుట్టింది. జాతీయ నూతన విద్యావిధానం-2020 అమల్లో భాగంగా దీన్ని చేపట్టినట్లు అధికారులు చెబుతున్నారు.

తల్లిదండ్రుల సమ్మతి

కేజీ నుంచి పీజీ వరకు ఈ విధానం అమలు చేయనున్నారు. జిల్లాలో తొలుత 9, 10, 11, 12 తరగతుల వారి వివరాలు సేకరించాలని నిర్ణయించారు. రానున్న రోజుల్లో కేజీ నుంచి అమలుచేస్తారు. ఇప్పటికే అన్ని పాఠశాలల యాజమాన్యాలకు అవగాహన కల్పించిన అధికారులు శనివారం నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో నమోదు చేసిన విద్యార్థుల వివరాలు వారి తల్లిదండ్రులకు పంపించి ధ్రువీకరించుకున్నారు. మార్పులుంటే(పుట్టినతేదీ కాకుండా) తల్లిదండ్రుల అంగీకారపత్రంతో ప్రధానోపాధ్యాయుడు మార్పు చేసే అవకాశం కల్పించారు. తర్వాత మార్పులకు అవకాశముండదని చెబుతున్నారు.

ఎలా పొందాలంటే?

ఇప్పటికే విద్యార్థి వివరాలు యూడైస్ ప్లస్‌లో నమోదు చేసినందునా.. అందులోనే తల్లిదండ్రులు సూచించిన సవరణలు చేసి ఆన్‌లైన్‌లో 'అపార్'కార్డుకు దరఖాస్తు చేయాలి. ప్రధానోపాధ్యాయుడి ధ్రువీకరణ తప్పనిసరి. ఆధార్ అనుసంధానమైన చరవాణికి ఓటీపీ వస్తుంది. అనంతరం గుర్తింపు నంబరు జారీ అవుతుంది. ఆన్‌లైన్‌లో కార్డు వెలువడిన తర్వాత సవరణలకు అవకాశం ఉండదు.

ప్రత్యేకతలు

విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, లింగం, ఫొటో, క్యూఆర్ కోడ్, 12 అంకెలతో కూడిన గుర్తింపు నంబరు డిజిటల్‌కార్డులో ఉంటాయి. అకాడమీ సమాచారం, విద్యార్థి విజయాలు ఎప్పటికప్పుడు నమోదవుతాయి. అకాడమీ పరంగా జీవితకాల గుర్తింపు కార్డుగా పరిగణిస్తారు. విద్యార్థి సంబంధిత సర్వ సమాచారం సమీకృతంగా ఒకేచోట లభిస్తుంది. ఆన్‌లైన్లో నంబరు నమోదు లేదా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసినా పూర్తి వివరాలు తెలుస్తాయి.



వెబ్‌సైట్ ముఖచిత్రం



నమూనా కార్డు

ప్రయోజనాలు

ఇది విద్యార్థికి గుర్తింపుకార్డుగా ఉపయోగపడుతుంది. విద్యార్థి బ్యాంకు ఖాతా(అకాడమీ), డీజీ లాకర్‌తో అనుసంధానమై ఉంటుంది. విద్యాసంస్థల ప్రవేశాలు, ప్రవేశ పరీక్షల్లో వివరాల నమోదు, ధ్రువీకరణ సులువవుతుంది. ఉపకార వేతనాలు, ఉద్యోగాల భర్తీ సమయం, ఇతర సందర్భాల్లో కీలకంగా మారనుంది.

భవిష్యత్తులో ఇదే కీలకం

- దుర్గాప్రసాద్, డీఈవో, నిజామాబాద్

అపార్‌కార్డు కీలకంగా మారనుంది. తల్లిదండ్రులు విద్యార్థి సమాచారం జాగ్రత్తగా పరిశీలించి, అనుమతి పత్రం సమర్పించాలి. తల్లిదండ్రులు చొరవ తీసుకొని పాఠశాల ప్రధానోపాధ్యాయులను సంప్రదించి, ప్రక్రియ పూర్తి చేసుకోవాలి. నాలుగు తరగతులకే పరిమితం కాకుండా.. దశలవారీగా మిగతా తరగతులకు అమలు చేస్తాం. ప్రవేశ సమయంలోనే వివరాలు సేకరించి, కార్డు ఇచ్చేలా చర్యలు తీసుకుంటాం.

బయోమైనింగ్ ప్రక్రియ ప్రారంభం !



పురపాలకశాఖ ఆదేశాల మేరకు జిల్లాలో మొదటిసారిగా బాన్సువాడ బల్దియా పరిధిలో బయోమైనింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ ప్రక్రియలో భాగంగా మొదట డంపింగ్‌యార్డు లోని చెత్త నిల్వలు అంతా కలిపి ఒక దగ్గర వేస్తారు. అందులో ఓ రసాయనం చల్లుతారు. కొద్ది రోజుల తర్వాత ఆ చెత్తను వాహనాల్లో నింపి బరువు చూస్తారు. తర్వాత ఆ చెత్తను ప్రత్యేక మిషన్లలో వేసి చెత్త నుంచి తడి, పొడి, ప్లాస్టిక్, హానికరవ్యర్థాలు, బయో సాయిల్.. ఇలాంటివి వేరు చేస్తారు. ఇలా చేయడంతో దుర్గంధం నివారించడంతో పాటు కంపోస్టు ఎరువు తయారు చేయడం, ప్లాస్టిక్ వస్తువుల పునర్వినియోగంతో పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు అందించినట్లు అవుతుందని అధికారులు చెబుతున్నారు. అలాగే డంపింగ్ యార్డు స్థలం సైతం వినియోగానికి సిద్ధంగా ఉండేలా చేసినట్లు అవుతుంది. ఈ విషయంపై బాన్సువాడ బల్దియా కమిషనర్ శ్రీహరి రాజు మాట్లాడుతూ.. 'బయోమైనింగ్ ప్రక్రియ ఇటీవలే ప్రారంభమైంది. చెత్తనిల్వలు ఒక దగ్గర పోగుచేశారు. దాని నుంచి వివిధ రకాల వ్యర్థాలు వేరు చేసి పునర్వినియోగం, ఎరువుల తయారీకి ఉపయోగపడేలా చేస్తారు. వీటిని బల్దియా అవసరాలకు, హరితహారంలో మొక్కల పెంపకం వంటి వాటికి వినియోగించే అవకాశం ఉంటుంది. ఎక్కువ ఉత్పత్తి అయితే విక్రయించడంతో ఆదాయం సైతం సమకూరుతుంది. పురపాలికశాఖ ద్వారా ఓ సంస్థ ఆధ్వర్యంలో పనులు ప్రారంభమయ్యాయి' అని తెలిపారు.

- న్యూస్‌టుడే, బాన్సువాడ పట్టణం

గడువు పొడిగింపు

నిజామాబాద్ విద్యావిభాగం: జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో ప్రవేశానికి ఈ నెల 30వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు జిల్లా కన్వీనర్ యాదగిరి శనివారం ప్రకటనలో తెలిపారు. అన్ని ఐటీఐల్లో మిగిలిన ఖాళీలతో పాటు మరో మూడు ఐటీఐల్లో ప్రవేశ పెట్టిన నైపుణ్యాభివృద్ధి కోర్సుల్లో ప్రవేశానికి చక్కని అవకాశమన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు చరవాణి నెంబర్లు 99481 95654, 94410 74767లలో సంప్రదించాలని సూచించారు.

రక్తదానానికి తరలిరండి

కామారెడ్డి పట్టణం: జిల్లాకేంద్రంలో ఆదివారం తలపెట్టిన మెగా రక్తదాన శిబిరానికి తరలిరావాలని ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర ఛైర్మన్ బాలు, రక్తదాతల సమూహ అధ్యక్షుడు వేదప్రకాశ్ అన్నారు. కామారెడ్డిలోని ఆయా కళాశాలల్లో కార్యక్రమ ప్రతులను ఆవిష్కరించారు. రక్తదాతల సమూహం ఆధ్వర్యంలో తలసేమియా బాధితుల కోసం శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. ప్రతినిధులు గంప ప్రసాద్, జమీల్, అనిల్‌కుమార్, దత్తాత్రి తదితరులున్నారు.

బీఫార్మసీ కౌన్సెలింగ్

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: బీఫార్మసీ/ఫార్మా డీ కళాశాలల్లో ప్రవేశానికి నిర్వహించిన టీజీఎప్‌సెట్‌బీ-2024 మొదటిదశ కౌన్సెలింగ్ శనివారం నుంచి ప్రారంభమైందని జిల్లా సమన్వయకర్త, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ నరేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ స్లాట్ బుకింగ్ తర్వాత 21-23 తేదీల్లో ఎంపిక చేసుకున్న సహాయ కేంద్రాల్లో ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కావాలన్నారు. 21-25 తేదీల్లో వెబ్ ఆప్షన్లు ఎంచుకోవాలన్నారు. 28వ తేదీలోపు సీట్ల కేటాయింపు ఉంటుందని పేర్కొన్నారు.

యోగాలో అనితరసాధ్యులు

న్యూస్‌టుడే, ఇందూర్ సిటీ

ఇందూరు చిన్నారులు శరీరంలో ఎముకలున్నాయా లేదా అన్నట్లుగా యోగాసనాలు వేస్తున్నారు.. వివిధ పోటీల్లో సత్తాచాటుతూ రాష్ట్ర, జాతీయస్థాయికి ఎంపికవుతున్నారు. ప్రముఖుల మన్ననలు పొందుతున్నారు. పలువురిని 'న్యూస్‌టుడే' పలకరించగా వారి మనోగతం వెల్లడించారు.


అసితా,


- రిత్విక,

మూడు సార్లు జాతీయస్థాయిలో..

ఏడేళ్లుగా యోగా గురువు సంగీత వద్ద శిక్షణ తీసుకుంటున్నాను. ఇప్పుడు ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాను. ఇప్పటి వరకు మూడు సార్లు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నాను. యోగా శిక్షణలో మానసిక శారీరక మార్పును గుర్తించాను. నిరంతరం సాధన చేసి మంచి గుర్తింపు తెచ్చుకోవాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాను. **- అసితా, నిజామాబాద్**

14 ఏళ్లుగా సాధన

డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నాను. 14 ఏళ్లుగా యోగాలో శిక్షణ తీసుకుంటున్నాను. నిరంతరం ఆసనాలు సాధన చేయడంతో పాటు చదువులోనూ రాణించడం సంతోషంగా ఉంది. ఇదివరకే మూడు సార్లు రాష్ట్రస్థాయిలో పాల్గొన్నాను. త్వరలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాను. రోజుకు గంటపాటు సాధన చేస్తే ఆరోగ్య సమస్యలు తలెత్తవు.
- రిత్విక, నిజామాబాద్

శారీరకంగా మానసికంగా ఎదుగుతారు



విద్యార్థి దశ నుంచే యోగా సాధనతో శారీరకంగా, మానసికంగా ఎదుగుతారు. కేంద్ర ప్రభుత్వం యోగా ప్రాముఖ్యం తెలిసేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. ఆయుష్ విభాగంలో యోగా సాధనను ఓ భాగంగా చేసింది. వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ సాధన చేయాలి.
- రాంచందర్, యోగా గురువు

నాన్నే నా శిక్షకుడు

మూడేళ్ల నుంచి యోగా సాధన చేస్తున్నాను. పదో తరగతి చదువుతున్నాను. శిక్షకులు మా నాన్న విజయ్‌కుమార్ కావడంతో సాధన మరింత సులువైంది. ఇప్పటి వరకు మూడు సార్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నాను. అంతర్జాతీయ వేదికపై ఆసనాలు ప్రదర్శించాలని నాన్న కోరిక. ఆ దిశగా సాధన చేస్తున్నాను.



- లక్ష్మీస్వీ, నిజామాబాద్

ఇద్దరం కలిసి..



మేమిద్దరం కవలలు కావడంతో అందరు మాలో ఎవరు తన్వీ, ఎవరు తన్యా గుర్తించేవారు కాదు. 9వ తరగతి చదువుతున్న మేము సంవత్సరం నుంచి శిక్షణ తీసుకుంటున్నాం. మా శిక్షకురాలు ఉమారాణి ఆసనాలపై పట్టు పెరిగేలా ప్రోత్సహిస్తున్నారు. రాష్ట్రస్థాయిలో రెండు సార్లు ప్రాతినిధ్యం వహించాం. నిత్యం రెండు గంటలు సాధన చేస్తాం.
- తన్వీ, తన్యా, నిజామాబాద్

దక్షిణభారత నాటిక పోటీలకు జిల్లా విద్యార్థులు

నిజామాబాద్ విద్యావిభాగం: జిల్లా కేంద్రం విజయ్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రూపొందించిన నాటకం ఎన్సీఈఆర్టీ ఆధ్వర్యంలో గురు, శుక్రవారాల్లో నిర్వహించిన డ్రామా ఫెస్టివల్‌లో ప్రథమ స్థానంలో నిలిచి దక్షిణ భారత నాటికపోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ ప్రభాదేవి శనివారం తెలిపారు. 'సేవ్ వాటర్.. హైడ్రా హోప్' అనే ఈ నాటికను రచించిన తొమ్మిదో తరగతి విద్యార్థి విజితేంద్రియ, సహాయ దర్శకత్వ బాధ్యతలు నిర్వర్తించిన శరణ్‌తేజతో పాటు ప్రదర్శనలో పాల్గొన్న తరుణ్, సిరివేద, తనుశ్రీ, రౌధాజహాన్, రవి త్రేయిని, రాజ్‌కరణ్‌రెడ్డి, శ్రీకర్, రోహన్‌రెడ్డిని పాఠశాల కార్యదర్శి అమృత లత అభినందించారు.



విద్యార్థులతో పాఠశాల కార్యదర్శి అమృతలత, యాజమాన్యం

గర్భిణులకు అండగా

✪ అందుబాటులో 102 అంబులెన్స్‌లు

న్యూస్‌టుడే, కామారెడ్డి వైద్యవిభాగం

గర్భిణులకు సకాలంలో వైద్య సేవలు అందేలా 108, 102 అంబులెన్స్ వాహనాలను సర్కారు అందుబాటులోకి తెచ్చింది. 108 అంబులెన్స్‌లు రోడ్డు ప్రమాదాలకు, అత్యవసర కేసులను ఆసుపత్రులకు తరలిస్తున్నారు. కొంతకాలంగా కామారెడ్డి జిల్లాలో గర్భిణులు వైద్య పరీక్షల కోసం గ్రామాల నుంచి జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వస్తున్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో ప్రసవమయ్యేందుకు ఒక్క కేసుకు రూ.40 వేల నుంచి రూ.60 వేల వరకు ఖర్చవుతోంది. అత్యవసర సమయాల్లో ఈ వాహనాలను వినియోగించుకునేవారికి ఆర్థిక పరంగా ఎంతో వెసులుబాటు కానుంది. 102 వాహనాలను గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని జీజీహెచ్ పర్యవేక్షణాధికారిణి ఫరీదా పేర్కొన్నారు.


కామారెడ్డి జీజీహెచ్ వద్ద 102 వాహన సేవలు వినియోగించుకుంటున్న గర్భిణులు, బాలింతలు

కామారెడ్డి జీజీహెచ్‌లో ప్రసవాలు

	సాధారణ	శస్త్రచికిత్స
మే	123	210
జూన్	121	191
జులై	112	201
ఆగస్టు	118	262
సెప్టెంబర్	115	240

ఖైదీలకు అసౌకర్యం కలిగించొద్దు

కామారెడ్డి నేరవిభాగం, న్యూస్‌టుడే: ఖైదీలకు అసౌకర్యం కలిగించకుండా చూసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి.నాగరాణి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఉప కారాగారాన్ని శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఖైదీలకు కల్పిస్తున్న వసతులపై ఆరా తీశారు. అనంతరం కారాగారంలోని వంట గదిని పరిశీలించారు. చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ న్యాయవాది మాయ సురేష్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ న్యాయవాది మోహన్‌రావు, ఉప కారాగారం సూపరింటెండెంట్ సంజీవరెడ్డి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ జూనియర్ అసిస్టెంట్‌లు ఖాన్, సాయిప్రజీత్, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.


ఖైదీలతో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి నాగరాణి

'ప్రజావ్యతిరేక ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు'

కామారెడ్డి పట్టణం: పేదల సమస్యలు పట్టని ఎన్డీయే ప్రభుత్వానికి ప్రజాక్షేత్రంలో గుణపాఠం తప్పదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు జ్యోతి అన్నారు. పట్టణంలో శనివారం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. దేశంలో యువతకు ఉద్యోగాల కల్పన, మహిళల భద్రత విషయంలో కేంద్రం విఫలమైందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యుడు భాస్కర్, రాష్ట్ర కమిటీ సభ్యురాలు రమ, జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్, జిల్లా కమిటీ సభ్యులు చంద్రశేఖర్, మోతీరాం, రవీందర్, అరుణ్, యాదగిరిగౌడ్, అజయ్, ఖలీల్, నర్సింలున్నారు.


నినాదాలు చేస్తున్న నాయకులు

21న ఫుట్‌బాల్ పోటీలు

నిజామాబాద్ క్రీడావిభాగం,: నగరంలోని రాజారాం స్టేడియంలో ఈ నెల 21న ఉదయం 10 గంటలకు అండర్-19 విభాగంలో ఉమ్మడి జిల్లా బాలబాలికల ఫుట్‌బాల్ ఎంపికలు నిర్వహించనున్నామని జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ చదివే విద్యార్థులు అర్హులని, క్రీడాకారులు సమయపాలన పాటించాలన్నారు. వివరాలకు పీడీ ప్రసాద్ 9441631631 నంబరులో సంప్రదించాలన్నారు.

జిల్లాస్థాయి వాలీబాల్ జట్ల ఎంపికలు పూర్తి

కామారెడ్డి క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి వాలీబాల్ జట్ల ఎంపికలు పూర్తయ్యాయి. కామారెడ్డిలోని సరస్వతి శిశుమందిర్‌లో శనివారం అండర్-17, 14 బాలబాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. అండర్-14 బాలుర విభాగంలో ప్రథమ బహుమతిని ఎల్లారెడ్డి జోన్, ద్వితీయ బహుమతిని తాడ్వాయి జట్లు గెలుచుకున్నాయి. అండర్-14 బాలికలు, అండర్-17 బాలుర, బాలికల విభాగాల్లో ఎల్లారెడ్డిజోన్ ప్రథమ, బాన్సువాడ జోన్ ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నాగభూషణం, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి హీరాలాల్, స్వామి గౌడ్, అశోక్, సురేశ్, సాయిమౌర్య, అతిక్, భాస్కర్, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.


అండర్-17కు ఎంపికైన బాలికల జట్టు

మహిళపై నలుగురి అత్యాచారం

నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే: నిజామాబాద్ జిల్లాలో ఓ మహిళపై నలుగురు అత్యాచారానికి ఒడిగట్టిన ఘటన కలకలం రేపింది. పోలీసుల కథనం ప్రకారం.. జిల్లా కేంద్రానికి మహిళ(36)ను శుక్రవారం రాత్రి బస్టాండు ప్రాంతం నుంచి ఇద్దరు వ్యక్తులు ఆటో ఎక్కించుకొని వెళ్లారు. డిచ్‌పల్లి ప్రాంతంలో నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి మరో ఇద్దరు కలిసి అత్యాచారం చేసి ఆమెను అక్కడే వదిలేసి పారిపోయారు. రాత్రి కావడంతో బాధితురాలు అక్కడి నుంచి ఇంటికి వచ్చారు. శనివారం ఉదయం ఒకటో ఠాణా పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి వెల్లడించారు. నిజామాబాద్ ఏసీపీ రాజావెంకటరెడ్డి కేసు విచారించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
బాన్సువాడ 83284 29129
కామారెడ్డి 93970 82242



జిల్లాకేంద్రంలోని 18వ వార్డులో చెత్త సేకరణకు సిబ్బంది రావడం లేదు. **అజ్మద్, 18వ వార్డు**

సిబ్బందితో చెత్త తొలగింపజేశాం. - **పర్వేజ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

కామారెడ్డి భవానీరోడ్డులో మురుగు కాల్వ పూడిక తీయడం లేదు. - **సంజయ్, భవానీరోడ్డు**

కాల్వ పూడికతీత చేపట్టాం. - **పర్వేజ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్**



రామారెడ్డి మూడో వార్డులో మురుగు కాలువలు శుభ్రం చేయక పోవడంతో దుర్వాసన వస్తోంది. **కిషన్, గ్రామస్థుడు.**

పరిశుభ్రత కార్మికులతో మురుగు కాలువ పూడికతీత తీయించాం. ప్రజల సమస్యను పరిష్కరించాను. **క్రాంతి, పంచాయతీ కార్యదర్శి.**

గ్రామ పంచాయతీ పరిసరాల్లో చెత్తాచెదారం పేరుకుపోయింది. ఎవరూ పట్టించుకోవటం లేదు - **శిరీష్, ముత్యంపేట, దోమకొండ (మం)**

పరిశీలించి సిబ్బందితో వెంటనే తొలగిస్తాం. - **అంజయ్య, గ్రామ కార్యదర్శి, ముత్యంపేట**

బాన్సువాడ అర్బన్‌కాలనీ రెండో రోడ్డులో ఖాళీ ప్రదేశంలో చెత్త ఉంది. దోమల బెడద రోగాల బారిన పడుతున్నాం. దుర్వాసన భరించలేకపోతున్నాం. - **సాయిలు సింగేవార్, బాన్సువాడ**

పరిసరాలను శుభ్రం చేసేలా చర్యలు తీసుకుంటాం. దోమల మందు పిచికారీ చేసి సమస్య పరిష్కరిస్తాం. - **హన్మాండ్లు, వార్డు ఇంజినీర్**

హస్టల్ ఎస్సీ కాలనీలో మురుగు కాల్వలు అధ్వానంగా మారాయి. **పవన్, హస్టల్ గ్రామం**

ఆదివారం సిబ్బందితో శుభ్రం చేయిస్తాం. **రమేష్, పంచాయతీ కార్యదర్శి హస్టల్**

పిట్లం మండల కేంద్రంలోని పోలీసు రాణా క్వార్టర్ పరిసరాల్లో వ్యర్థాలు పేరుకుపోయాయి. **రాజేశ్, స్థానికుడు**

చెత్త చెదారం తొలగించి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతాం. **యాదగిరి, పంచాయతీ కార్యదర్శి, పిట్లం.**

- న్యూస్‌టుడే, దోమకొండ,రామారెడ్డి,పిట్లం, కామారెడ్డి పట్టణం, బాన్సువాడ పట్టణం, బిచ్కుంద (గ్రామీణం,కామారెడ్డి పట్టణం

ఆర్టీసీ న్యాయవాదిగా గజ్జె భిక్షపతి



భిక్కనూరు, న్యూస్‌టుడే: కామారెడ్డి జిల్లా ఆర్టీసీ న్యాయవాదిగా భిక్కనూరుకు చెందిన గజ్జె భిక్షపతిని నియమిస్తూ రాష్ట్ర ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ కార్యాలయం అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా కోర్టు పరిధిలోని ఆర్టీసీ కేసులను ఆయన వాదించనున్నారు. ఈ మేరకు న్యాయవాదులు, గ్రామస్థులు ఆయనను అభినందించారు.

నాణ్యమైన విద్య అందిస్తాం

బాన్సువాడ, న్యూస్‌టుడే: విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడమే తమ లక్ష్యం అని జిల్లా నోడల్ అధికారి సలాం పేర్కొన్నారు. శనివారం బాన్సువాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. అభివృద్ధి కమిటీ సభ్యులు శ్రీనివాస్, ఇన్‌ఛార్జి ప్రధాన అధ్యాపకులు శివకుమార్, అధ్యాపకులు జలీల్, స్వరూప్, మహేష్, దయానంద్, కార్తీక్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.


పెద్దకొడప్‌గల్, న్యూస్‌టుడే: ప్రభుత్వ బడుల్లో మెరుగైన విద్యనందించేలా కృషి చేస్తున్నామని ఎంఈవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం అంజని పాఠశాలలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. సీఆర్పీలు గోపాల్, రాములు, ఉన్నారు.

ఠాణాలో ఓపెన్‌హౌస్

గాంధారి, న్యూస్‌టుడే: ఈ నెల 21 పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం గాంధారి ఠాణాలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎస్సై ఆంజనేయులు ఆధ్వర్యంలో ఓపెన్ హౌస్ నిర్వహించారు. స్టేషన్‌లోని ఆయుధాలు, విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై ఆంజనేయులు



అంబేడ్కర్‌నగర్‌లోని ప్రభుత్వ బడిలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు



విజేతలతో ప్రధానోపాధ్యాయుడు రవీందర్



కొనబాన్సువాడ ఉన్నత పాఠశాలలో పరీక్షకు హాజరైన విద్యార్థులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రధానోపాధ్యాయుడు విజయ్‌కుమార్

పరీక్ష రాసి.. ప్రతిభ చాటి

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే : జిల్లాకేంద్రం అంబేడ్కర్‌నగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు 'ఈనాడు' ఆధ్వర్యంలో శనివారం ప్రతిభ పాటవ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో సుప్రియ (ప్రథమ), మనోజ్‌(ద్వితీయ), హర్షవర్ధన్‌(తృతీయ) బహుమతులు గెలుపొందున్నారు. విజేతలకు ప్రధానోపాధ్యాయుడు రవీందర్ బహుమతులు అందజేశారు. పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాన్సువాడ, న్యూస్‌టుడే : బాన్సువాడలోని కొన బాన్సువాడ ఉన్నత పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు జరిగాయి. ఇందులో అంజలి (ప్రథమ), పవన్‌కుమార్ (ద్వితీయ), భరత్ (తృతీయ) బహుమతులు గెలుపొందారు. వీరికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయ్‌కుమార్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పురుషోత్తం, రాములు, రామచేందర్, కృష్ణ, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రాత్రి వేళలో వైద్యం కరవు

- కాంట్రాక్టు పద్ధతిన వైద్యుడి సేవలు
- బీర్కూర్ పీహెచ్‌సీలో ఇదీ పరిస్థితి

న్యూస్‌టుడే, బీర్కూర్

బీర్కూర్ పీహెచ్‌సీకి రోగుల తాకిడి పెరిగింది. కానీ ఆసుపత్రిలో సరిపడా వైద్యులు లేకపోవడంతో రాత్రి వేళల్లో వైద్యం కోసం వచ్చే రోగులు అవస్థలు పడుతున్నారు. పీహెచ్‌సీకి ఇద్దరు వైద్యులను నియమించాలని వారు కోరుతున్నారు.

నిత్యం 150 నుంచి 200 మంది..

వైద్యం కోసం ఈ పీహెచ్‌సీకి నిత్యం 150 నుంచి 200 మంది వరకు రోగులు వస్తారు. అందులో నస్రుల్లాబాద్, బీర్కూర్, మద్నూర్, బిచ్కుంద, డోంగ్లీ, కోటగిరి, పొతంగల్ మండలాల్లోని గ్రామాల ప్రజలు ఉన్నారు. కానీ ఇక్కడ కేవలం ఆరు పడకలు మాత్రమే ఉన్నాయి. 24 గంటల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఇద్దరు వైద్యులు ఉండాలి. కానీ ఆసుపత్రి ఏర్పాటైనప్పటి నుంచి ఉన్నతాధికారులు ఒకే వైద్యుడిని నియమిస్తున్నారు. ఇక్కడ రెండేళ్ల నుంచి రెగ్యులర్ వైద్యుడు లేరు. డోంగ్లీ పీహెచ్‌సీ వైద్యురాలు శ్రీలేఖను జిల్లా ఉన్నతాధికారులు డిప్యుటేషన్‌పై 2023 జనవరిలో బీర్కూర్ పీహెచ్‌సీకి పంపారు. ఆమె ఇక్కడ ఏడాది పాటు విధులు నిర్వర్తించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో డిప్యుటేషన్ రద్దు కావడంతో తిరిగి డోంగ్లీ వెళ్లారు. ప్రస్తుతం కాంట్రాక్టు వైద్యుడిగా గిరీష్‌కుమార్ విధులు నిర్వర్తిస్తున్నారు. ఒకే వైద్యుడు ఉండటంతో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు రోగులకు వైద్య సేవలు అందుతున్నాయి. రాత్రి వేళల్లో వైద్యుడు ఉండటం లేదు. కేవలం స్టాఫ్‌నర్సు, ఏఎన్‌ఎం ఉంటారు. ఆ సమయంలో అత్యవసర చికిత్స నిమిత్తం రోగులు వస్తే కేవలం ప్రాథమిక చికిత్స చేసి బాన్సువాడ, నిజామాబాద్ ఆసుపత్రులకు రెఫర్ చేస్తున్నారంటూ ఇటీవల స్థానికులు వైద్య సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. మరో వైద్యుడిని నియమిస్తే రాత్రి వేళల్లో సైతం వైద్యం అందుతుందని రోగులు చెబుతున్నారు. ఈ విషయంపై బాన్సువాడ డిప్యూటీ డీఎంహెచ్‌వో విద్య మాట్లాడుతూ.. 'రోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రస్తుతం కాంట్రాక్టు వైద్యుడితో ఓపీ సేవలందిస్తున్నాం. డిసెంబరులో రెగ్యులర్ వైద్యుడు రావొచ్చు' అని తెలిపారు.





రైతులకు కెపాసిటర్ డబ్బాలను అందజేస్తున్న అధికారులు

మోటార్లకు కెపాసిటర్లు బిగించాలి

జుక్కల్, న్యూస్‌టుడే: రైతు పొలం బాట కార్యక్రమంతో అన్నదాతల వద్దకే వెళ్తున్నామని, ఎలాంటి విద్యుత్తు సమస్యలున్నా తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకొంటున్నామని విద్యుత్తుశాఖ డీఈఈ ప్రభాకర్‌రావు అన్నారు. శనివారం ఖండేబల్లూర్, వజ్రఖండి శివారుల్లో ఆయన రైతులతో కలిసి పొలం గట్టుకు వెళ్లారు. కొన్ని నియంత్రికలకు మరమ్మతులు చేపట్టినట్లు చెప్పారు. మోటార్లకు కెపాసిటర్లను బిగించుకోవాలని సూచించారు. వెంట ఏడీఏ సంజీవ్‌రావు, ఏఈలు మోహన్, అరవింద్, బాలాజీ, లైన్ ఇన్‌స్పెక్టర్లు అనిల్, సుధీర్ పూరి రైతులు ఉన్నారు.

చేపపిల్లల పంపిణీ వేగవంతం

కామారెడ్డి వ్యవసాయం, న్యూస్‌టుడే: జిల్లాలోని అన్ని చెరువుల్లో చేప పిల్లల పంపిణీని వేగవంతం చేయాలని మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు గాదం సత్యనారాయణ కోరారు. జిల్లా మత్స్యశాఖ కార్యాలయంలో శనివారం నిర్వహించిన జిల్లా సంఘం కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నూతన సభ్యత్వాలను ప్రారంభించాలన్నారు. జిల్లా మత్స్య శాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన శ్రీపతిని సత్కరించారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పసుపుల పెద్దసాయిలు, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్థులతో చర్చిస్తున్న అటవీ శాఖ అధికారులు

సంయుక్త సర్వే చేపట్టాలి

గాంధారి, న్యూస్‌టుడే: గౌరారం పరిధిలో అన్యాక్రాంతమవుతున్న 150 ఎకరాల అటవీ భూమిపై అటవీ, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో ఉన్నతాధికారుల సమక్షంలో సంయుక్త సర్వే చేపట్టి హద్దులు గుర్తించాలని గౌరారం గ్రామస్థులు డిమాండు చేస్తున్న విషయం విదితమే. శనివారం కామారెడ్డి ఎఫ్‌డీవో రామకృష్ణ , గాంధారి, బాన్సువాడ ఎఫ్‌ఆర్వోలు హేమచందన, హబీబ్‌లు గౌరారంలో గ్రామస్థులతో మరోమారు సమావేశమై చర్చించారు. మ్యాప్‌లో సూచించినట్లుగా కందకాలు లేవని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం నుంచి సర్వే చేపడతామని అధికారులు గ్రామస్థులకు హామీ ఇచ్చారు. అటవీ సిబ్బంది, గ్రామస్థులు శంకర్, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

చెక్కులు అందజేత

నిజాంసాగర్, న్యూస్‌టుడే: అన్ని వర్గాల అభివృద్ధే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి పని చేస్తున్నారని నిజాంసాగర్ మండల కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో ఇద్దరు బాధితులకు సీఎం సహాయనిధి చెక్కులు అందజేశారు. నాయకులు అనీస్, రాము, రమేష్, సత్యగౌడ్, రాజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తరుగు పేరుతో మోసం చేస్తే చర్యలు

నాగిరెడ్డిపేట, న్యూస్‌టుడే: కొనుగోలు కేంద్రాల్లో తరుగు పేరుతో తూకంలో తేడాలు నమోదు చేస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు హెచ్చరించారు. శనివారం నాగిరెడ్డిపేట మండలంలోని గోపాల్‌పేట్, నాగిరెడ్డిపేట్, ధర్మారెడ్డి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించామని, సిబ్బంది వారికి సహకరించాలని సూచించారు. పోచారం ప్రాజెక్టు, తాండూరు త్రిలింగరామేశ్వర ఆలయాన్ని అభివృద్ధి చేసి స్థానికులకు ఉపాధి అవకాశాలు మెంపొందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు రజిత, సొసైటీ అధ్యక్షులు గంగారెడ్డి, నర్సింలు, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్, నాయకులు రాంచందర్ రెడ్డి, విఠల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, దివిటి కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం తూకం వేస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్

అధ్యాపకుల సమస్యను పరిష్కరిస్తా

నాగిరెడ్డిపేట, న్యూస్‌టుడే: నాగిరెడ్డిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెలకొన్న అధ్యాపకుల సమస్యను త్వరలో పరిష్కరిస్తానని ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు తెలిపారు. శనివారం ఆయన కళాశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులతో కలిసి బాస్కెట్ బాల్ ఆడారు. మండల పార్టీ అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్, సీనియర్ నాయకులు రాంచందర్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, ఇమాం, గులాం,షాహిద్, తదితరులు ఉన్నారు.

తల్లిదండ్రులు పిల్లలను గమనించాలి: కలెక్టర్

దోమకొండ, న్యూస్‌టుడే: పిల్లలు నిత్యం కళాశాలకు వెళ్తున్నారా లేదా? వారేం చదువుతున్నారో తల్లిదండ్రులు గమనించాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. శనివారం దోమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తల్లిదండ్రుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ... విద్యార్థులు సబ్జెక్టులపై అవగాహన పెంచుకొని ఉత్తీర్ణత సాధించాలన్నారు. కళాశాలలో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు. బస్సులు సమయానికి రావడం లేదని విద్యార్థులు తెలపగా.. ఆర్టీసీ వారితో మాట్లాడతానని కలెక్టర్ అన్నారు. కార్యక్రమంలో డీఐఈవో షేక్ సలాం, తహసీల్దారు సంజయ్‌రావు, మండల ప్రత్యేకాధికారి జ్యోతి, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ప్రిన్సిపల్ శంకర్ పాల్గొన్నారు.

మద్యం దుకాణాలపై చర్యలు తీసుకోవాలి

దోమకొండ, న్యూస్‌టుడే: దోమకొండలోని సాయి, శ్రీ నవదుర్గ మద్యం దుకాణాలు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నాయని, వాటిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామస్థులు దోమకొండ ఆబ్కారీ సీఐ కార్యాలయానికి శనివారం వచ్చారు. గ్రామ పంచాయతీ వ్యాపార అనుమతి (ట్రేడ్ లైసెన్స్) లేకుండా వీటిని నిర్వహిస్తున్నారని వారు సీఐ మధుసూదన్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ముత్యంపేటలో మూడు గొలుసు దుకాణాలు నడుస్తున్నాయని, కల్తీ మద్యాన్ని విక్రయిస్తున్నారని వారు ఆరోపించారు. ఈ విషయమై 'న్యూస్‌టుడే' సీఐని వివరణ కోరగా.. నిబంధనల ప్రకారమే రెండు మద్యం దుకాణాలు నడుస్తున్నాయని తెలిపారు.

రుసుం చెల్లించాలని నోటీసులు

దోమకొండ: దోమకొండలోని సాయి, శ్రీ నవదుర్గ మద్యం దుకాణాలకు శనివారం స్థానిక గ్రామ పంచాయతీ వారు నోటీసులను జారీ చేశారు. వ్యాపార లైసెన్స్ లేకుండా ఏడాదిన్నరగా నిర్వహిస్తున్నారని, రుసుం చెల్లించాలని నోటీసులను మద్యం దుకాణాలకు అతికించారు. దుకాణ నిర్వాహకులు గ్రామ పంచాయతీ కార్యాలయానికి చేరుకుని లైసెన్స్ ఇవ్వాలని గ్రామ కార్యదర్శి దయాకర్‌రెడ్డిని కోరారు. ఆన్‌లైన్ సర్వర్ బిజీగా ఉండటంతో లైసెన్స్‌లను తొందరలో అందిస్తామని కార్యదర్శి పేర్కొన్నారు.

ప్రతిభతోనే రాణింపు

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో దాగి ఉన్న వైజ్ఞానిక ప్రతిభను ఉపాధ్యాయులు వెలికితీయాలని డీఈవో రాజు అన్నారు. కామారెడ్డి దేవునిపల్లి ప్రభుత్వ బడిలో శనివారం వైజ్ఞానిక కార్యశాల జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు అదనపు అంశాలపై దృష్టి పెట్టాలన్నారు. ఈ సందర్భంగా నూతనంగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి సిద్దిరాంరెడ్డి, ఫిజికల్ సైన్స్ ఫోరం అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి సదాశివ, బయోలాజికల్ సైన్స్ ఫోరం అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణాకర్‌రావు తదితరులున్నారు.



కామారెడ్డిలో మాట్లాడుతున్న డీఈవో రాజు

భక్తితో మార్పు

గాంధారి, న్యూస్‌టుడే: భక్తితో మానసిక ప్రవర్తనలో మార్పు కల్గుతుందని మాజీ ఎమ్మెల్యే సురేందర్ అన్నారు. శనివారం మేడిపల్లిలోని కోదండ రామాలయ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాల్లో సతీ సమేతంగా పాల్గొని గోమాతకు, విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్థులు, భారాస నాయకులు పాల్గొన్నారు



ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సురేందర్ దంపతులు

కొడుకును.. తండ్రి వాగులో తోసేశాడని ప్రచారం

- అవాస్తవమని స్పష్టం చేసిన పోలీసులు

బాన్సువాడ, న్యూస్‌టుడే: బాన్సువాడ పట్టణంలోని పెద్దపూలు వాగులో శనివారం కొడుకును తండ్రి వాగులో తోసేశాడని ప్రచారం జరిగింది. 'కొడుకును వాగులో వేశా.. మృతదేహాన్ని తీసుకొచ్చుకో' అని తన భర్త చెప్పాడని దేశాయిపేటకు చెందిన ఓ మహిళ అందరికీ చెప్పడం బాన్సువాడ, దేశాయిపేట్ గ్రామాలతో పాటు ఇతర గ్రామాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు వాగు వద్దకు వెళ్లి పరిశీలించారు. విచారణ చేయగా బాలుడు అమ్మమ్మ ఊరిలో క్షేమంగానే ఉన్నాడని తెలియడంతో ఊపిరి పీల్చుకున్నారు. సదరు మహిళ భర్తను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. ఈ విషయమై బాన్సువాడ సీఐ అశోక్‌ను వివరణ కోరగా.. ప్రచారం జరిగింది వాస్తవమేనని, కానీ బాలుడు అమ్మమ్మ ఇంటి వద్ద క్షేమంగా ఉన్నాడని తెలిపారు

నలుగురి ఆత్మహత్య

లింగంపేట, న్యూస్‌టుడే: అనారోగ్య సమస్యలతో ఒకరు... అప్పుల బాధతో మరొకరు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటనలు శనివారం లింగంపేటలో చోటుచేసుకున్నాయి.



దాస్‌గౌడ్, రాజు

మండల కేంద్రానికి చెందిన దొడ్ల దాస్‌గౌడ్(53) గత ఆరేళ్లుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. చికిత్స చేసినా నయం కాకపోవడంతో ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మరో ఘటనలో.. జినుగరి రాజు(46) గత నాలుగు సంవత్సరాలుగా కామారెడ్డిలో సెంట్రింగ్ పని చేస్తూ జీవిస్తున్నారు. మద్యానికి బానిసై అప్పులపాలయ్యాడు. అవి తీర్చే మార్గం లేక జీవితంపై విరక్తి చెంది శనివారం తన ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అరుణ్ తెలిపారు.

బీబీపేటలో..

బీబీపేట, న్యూస్‌టుడే: గ్రామానికి చెందిన నాగ్యరి చంద్రం(39) కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. జీవితంపై విరక్తి చెంది శనివారం ఇంటికి ఎదురుగా ఉన్న చెట్టుకు ఉరేసుకున్నాడు. మృతుడి భార్య నర్సవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రభాకర్ తెలిపారు.



చంద్రం

చెరువులో పడి వృద్ధురాలి ..

తాడ్వాయి, న్యూస్‌టుడే: మండలంలోని ఎర్రపహాడ్ గ్రామానికి చెందిన చెవిటి రాజవ్వ (78) శనివారం మాలకుంట చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్థులు తెలిపారు. ఆమె గత కొంత కాలంగా మోకాళ్ల నొప్పులతో బాధపడుతోంది.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

బీబీపేట: మల్కాపూర్ గ్రామానికి చెందిన ఆశిగారి మనోజ్‌గౌడ్(25) పెద్దమల్లారెడ్డి గ్రామం వద్ద ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్నాడు. కడుపు నొప్పితో బాధపడుతున్న అతడు జీవితంపై విరక్తి చెంది ఈ నెల 14న తన ఇంటి వద్ద గుర్తుతెలియని పురుగు మందు తాగాడు. ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. యువకుడి తండ్రి ఆశిగారి శ్రీనివాస్‌గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రభాకర్ తెలిపారు.



మనోజ్‌గౌడ్

వ్యక్తి అదృశ్యం

గాంధారి, న్యూస్‌టుడే: మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి అదృశ్యమైనట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. దుర్గానగర్ కాలనీకి చెందిన చింతల సాయిలు ఈ నెల 18న ఇంటి నుంచి వెళ్లి మళ్లీ రాకపోవడంతో కుటుంబసభ్యులు పలు ప్రాంతాల్లో గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో ఆయన భార్య మరియమ్మ ఫిర్యాదు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఇంట్లో నుంచి వెళ్లేటప్పుడు తెల్లచొక్కా, నల్ల ప్యాంటు వేసుకొని ఉన్నాడని, ఐదు అడుగుల ఎత్తు ఉంటాడని, ఆచూకీ తెలిసిన వారు చరవాణి నంబరు 87126 86165కు సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.



సాయిలు

రైల్వే పోలీసుల అదుపులో అనుమానితులు

భిక్కనూరు: బంగారం దొంగతనం కేసులో పెద్దమల్లారెడ్డికి చెందిన ఇద్దరు అనుమానితులను కాచిగూడ రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు భిక్కనూరు సీఐ సంపత్‌కుమార్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. దుర్గామాత నిమజ్జనం సందర్భంగా పెద్దమల్లారెడ్డికి చెందిన 15 మంది డప్పు కొట్టడానికి ఇటీవల కాచిగూడ ప్రాంతానికి వెళ్లారు. వీరు ప్రయాణించిన రైల్వే బోగీలో బ్యాగు, బంగారం చోరీ అయినట్లు అక్కడి రైల్వే పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా విచారణ చేపట్టిన కాచిగూడ రైల్వే పోలీసులు శనివారం భిక్కనూరు పోలీసుల సాయంతో పెద్దమల్లారెడ్డి గ్రామానికి వచ్చి పలువురి వివరాలు సేకరించారు. అనంతరం గ్రామానికి చెందిన ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకుని కాచిగూడ తీసుకెళ్లారు. ఇద్దరు అనుమానితులు నేరం అంగీకరించినట్లు సమాచారం.

జూద స్థావరంపై దాడి

పిట్లం: చిల్లర్గి శివారులోని గొల్లగుట్ట అటవీ ప్రాంతంలో జూద మాడుతున్నారన్న సమాచారం మేరకు శనివారం పోలీసులు దాడులు నిర్వహించి ఎనిమిది మందిని పట్టుకున్నట్లు ఎస్సై రాజు తెలిపారు. వారి నుంచి కొంత నగదు, చరవాణులు, ద్విచక్ర వాహనాలను స్వాధీనపర్చుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఇద్దరు దొంగల రిమాండ్

గాంధారి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని జువ్వాడి గ్రామంలో కొన్ని రోజుల క్రితం వడ్ల పండరి ఇంట్లో చోరీ జరిగిన విషయం తెలిసిందే. అదే గ్రామానికి చెందిన పండరి బంధువులైన వడ్ల రాకేష్, అతని అన్న వడ్ల శ్రీకాంత్ కలిసి దొంగతనం చేసి దొంగిలించిన సొత్తును గాంధారిలోని ఓ దుకాణంలో విక్రయించడానికి ప్రయత్నించగా యజమానికి అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు నిందితులను పట్టుకొని విచారించారు. వారి నుంచి పూర్తి సొమ్మును స్వాధీనం చేసుకొని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ఆంజనేయులు పేర్కొన్నారు.



నిందితులతో ఎస్సై ఆంజనేయులు

ప్రభుత్వ భూమి కబ్జాపై ఫిర్యాదు

గాంధారి, న్యూస్‌టుడే: ప్రభుత్వ భూమి కబ్జాకు గురికాకుండా కాపాడాలంటూ.. ఎంపీడీవో రాజేశ్వర్‌కు మొండిసడక్, వెంకటాపూర్ గ్రామ వాసులు శుక్రవారం ఫిర్యాదు చేశారు. భారాస కార్యకర్త పండిత్, మొండిసడక్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నయింఖాన్, నసర్, చంద్రకాంత్, మహబూబ్, వినోద్ తదితరులు ఉన్నారు. 'న్యూస్‌టుడే' ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి రేణుకను వివరణ కోరగా ఆ భూమి కబ్జాకు గురి కాకుండా ట్రస్ట్ సాయంతో వాటరు ట్యాంకు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

చర్యలకు డిమాండు

బిచ్కుంద, న్యూస్‌టుడే: మహ్మద్‌ప్రవక్తపై అనుచిత వాఖ్యలు చేసిన ఆనంద్‌స్వామిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బిచ్కుందలో శనివారం ముస్లింలు ర్యాలీ నిర్వహించారు. మజీద్ నుంచి కొత్త బస్టాండ్, అంబేడ్కర్ చౌరస్తా, తహసీల్దార్ కార్యాలయం. పాతబస్టాండ్, వరకు ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ సురేష్, సీఐ నరేష్‌కు వినతి పత్రాలు అందజేశారు. కలీంపటేల్, పాషా, అన్వర్, బాబా పాల్గొన్నారు.



బిచ్కుంద: ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు